నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, ఆదివారం 25 ఫిబ్రవరి 2024 | KARIMNAGAR

పదిరలో ఎండిపోయిన చెక్‌డ్యాం

చెక్‌డ్యాంలు వెలవెల

ఎగువమానేరు కింద అడుగంటుతున్న జలవనరులు

రెండు మండలాల్లో ప్రశార్థకంగా 2500కుపైగా ఎకరాలు

ఆందోళనలో రైతులు సాగునీరివ్వాలని వేడుకోలు

మానేరు పరీవాహక ప్రాంతంలో అడుగంటుతున్న భూగర్భ జలాలు

ఎగువ మానేరు ప్రాజెక్టు నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయం (మిడ్‌మానేరు) వరకు నదీ తీర ప్రాంత రైతులకు మళ్లీ నీటి కష్టాలు మొదలయ్యాయి. కాళేశ్వరం ప్రాజెక్టుతో నాలుగైదేళ్లుగా యాసంగి సాగుకు ఢోకా లేకుండా పోగా, ఈ సీజన్‌లో వాగులో నీళ్ల ప్రవాహం లేక భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. తొమ్మిది చెక్ డ్యాంలకు దాదాపు నాలుగు ఎండిపోగా, మరో పది పదిహేను రోజుల్లో మిగతావి కూడా అడుగంటే ప్రమాదమున్నది. వీటి పరిధిలో వేలాది ఎకరాలు ఎండిపోయే ముప్పు ఉండగా, కర్షకలోకంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నది. సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని వేడుకుంటున్నది.

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 24 : కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన తర్వాత మానేరు తీర రైతులకు నీటి కష్టాలు దూరమయ్యాయి. మల్లన్నసాగర్ నుంచి గతేడాది వరకు యాసంగిలోనూ కూడెల్లి వాగు ద్వారా నీళ్లు ఇవ్వడంతో ఎగువ మానేరు ప్రాజెక్టు నిండి 13 వేల ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా నీళ్లు వచ్చాయి. అలాగే, మానేరు వాగుపై తొమ్మిది చెక్‌డ్యాంలు సజీవంగా మారి, సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు ఉబికి వచ్చాయి. ఫలితంగా బోర్లు, వ్యవసాయ బావుల కింద పుష్కలంగా పంటలు పండాయి. నాలుగేళ్లపాటు యాసంగికి ఏ ఢోకాలేకుండా పోయింది. కానీ, ప్రస్తుతం మానేరు తీరం వెంట భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఆశించిన స్థాయిలో నీళ్లు రాక చాలా వరకు చెక్‌డ్యాంలు వెలవెలబోతున్నాయి. పదిర, రాగట్లపల్లి, వెంకటాపూర్, సర్దాపూర్ చెక్‌డ్యాంలు దాదాపుగా అడుగంటాయి. మిగతా ఐదు చోట్ల అంతో కొంత నీళ్లున్నా.. పై నుంచి నీళ్లు రాకపోతే అవి కూడా ఎండిపోనున్నాయి. ఇటు చెరువులు, కుంటలు కూడా కళతప్పుతున్నాయి. దీంతో పరీవాహక ప్రాంతంలోని పంటలు దెబ్బతినే ముప్పున్నది. ప్రధానంగా ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లోని మానేరు వాగు పరీవాహక ప్రాంత గ్రామాలైన బండలింగంపల్లి, సింగారం, పదిర, హరిదాస్‌నగర్, ఆవునూరు, రామలక్ష్మణులపల్లె, వెంకటాపూర్ పరిధిలో 2500లకుపైగా ఎకరాలు బోరుబావుల ద్వారా సాగవుతుండగా, ఇప్పుడవి ఎండిపోయే ప్రమాదం కనిపిస్తున్నది. మరో పదిహేను రోజులు ఇలాగే ఉంటే చేతికొచ్చిన పంటలు కండ్ల ముందే ఎండిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీళ్లు ఇచ్చి పంటలను కాపాడాలని వేడుకుంటున్నారు.

నీళ్లడుగుమని.. రైతును కాపాడుమని

ఎవరి మీదనో కోపం రైతు మీద సూపియ్యకుమని. ఎట్లనన్న జేసి నీళ్లిడిసి రైతును కాపాడుమని. మూడేండ్ల సంది లేని తిప్పలు ఇప్పుడే ఎందుకచ్చినయో అర్థంకాలె. ఇంకా పదిహేను రోజులు గిట్లనే ఉంటే పొలాలన్నీ ఎండి రైతులు రోడ్లమీదికచ్చే పరిస్థితి ఉంది. ఇన్నేండ్లు కరెంటు, నీళ్లకు తిప్పలు లేకుంట ఉన్నం. బాధలు పోయినయనుకుంటే మళ్ల రైతులు గోసపడేటట్టు కనవడుతున్నది. దయచేసి మా పొలాలకు నీళ్లిచ్చి ఆదుకోవాలె.

- గుల్లపల్లి నారాయణరెడ్డి, రైతు, పదిర (ఎల్లారెడ్డిపేట)

నీళ్లు లేక వెలవెలబోతున్న వెంకటాపూర్ చెక్‌డ్యాం

మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, పక్కన బీఆర్ఎస్ నేతలు చల్మెడ లక్ష్మీనరసింహారావు, లోక బాపురెడ్డి

గ్యారెంటీలకు ఎగనామం పెట్టద్దు

ఎన్నికల కోడ్ రాకముందే హామీలు అమలు చేయాలి

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

కథలాపూర్, ఫిబ్రవరి 24: 'పార్లమెంట్ ఎన్నికల కోడ్ సాకుతో కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారెంటీలకు ఎగనామం పెట్టద్దు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లో అమలు చేయాలి' అని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మిగిలిన హామీల అమలు కోసం ఎన్నికల కోడ్ రాకముందే జీవోలు జారీ చేయాలని చెప్పారు. యాసంగి ధాన్యానికి క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బీఆర్ఎస్‌పై విషం చిమ్ముతున్నాడని ధ్వజమెత్తారు. కరీంనగర్ అభివృద్ధికి ఐదు కొత్తలు తేలేని అసమర్థుడు బీఆర్ఎస్ మునిగిపోయే నావ అంటూ తలాతోక లేకుండా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. బీఆర్ఎస్ మునిగిపోయే పడవ కాదని, తుఫాన్లను తట్టుకొని దూసుకొచ్చే పడవ అని అభివర్ణించారు. ఇప్పటికైనా అబద్ధాలు మాట్లాడడం మానుకొని ఐదేండ్లలో చేసిన పనులేంటో చెప్పాలని నిలదీశారు. కథలాపూర్ మండలం తాండ్రియాల్‌లో శనివారం బీఆర్ఎస్ ముఖ్య నేతలు చల్మెడ లక్ష్మీనరసింహారావు ,లోకబాపురెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. అడ్డగోలు హామీలిచ్చి కాంగ్రెస్ అబద్ధాల పునాదులపై అధికారం దక్కించుకున్నదని దుయ్యబట్టారు. అప్పుడు ప్రగల్భాలు పలికి ఇప్పుడు గ్యారెంటీల అమలు చేసేందుకు కిందామీద పడుతున్నదన్నారు. ఒక్క గ్యారెంటీలోని మహాలక్ష్మీ పథకం కింద ఫ్రీ బస్సు జర్నీ కల్పించిందని, కానీ, అందులోనే మరో రెండు హామీలున్నాయనే విషయాన్ని విస్మరిస్తున్నదని దుయ్యబట్టారు. వడ్లకు మద్దతు ధర రాకుంటేనే ₹500 బోనస్ ఇస్తామని, ఆ పార్టీ కిసాన్ సెల్ చైర్మన్ కోదండరెడ్డి చెప్పడం విడ్డూరమన్నారు. తెలంగాణలో ఎన్నో ఏండ్ల సంది కేసీఆర్ సర్కారు మద్దతు ధర ఇస్తున్నదని, కానీ బోనస్ నుంచి తప్పించుకొనేందుకే ఇప్పుడు ఇట్లా మాట్లాడడం శోచనీయమన్నారు. మేడిగడ్డ బరాజ్‌కు పగుళ్లు వచ్చాయనే ప్రచారంలో ఈ యాసంగిలో గోదావరి నీళ్లను ఇతర ప్రాజెక్టులోకి ఎత్తిపోయకపోవడంతో రైతులు పంటల సాగుకు తగ్గించారని, అయినా వేసిన పంటలు సైతం ఎండిపోతున్నాయన్నారు. వచ్చే వానకాలంలో గోదావరి నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున మేడిగడ్డ బరాజ్‌ను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ జవ్వాజి రేవతి, వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ దాసరి గంగాధర్, సీనియర్ నేతలు చీటి విద్యాసాగర్‌రావు, కల్లెడ శంకర్, వర్ధినేని నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల బలోపేతానికి కృషి

కమాన్ చౌరస్తా, ఫిబ్రవరి 24 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల బలోపేతానికి తాము కృషి చేస్తామని టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో 'తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్' రూపొందించిన అడ్మిషన్ వాల్‌పోస్టర్ (గోడ ప్రతి)ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరేళ్లుగా తమ సంఘం రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల బలోపేతానికి ఎనలేని కృషి చేసినట్లు చెప్పారు. ఇక్కడ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట రామకృష్ణ, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఏ శ్రీనివాస్, సంఘ సభ్యులు వీ శ్రీనివాస్, ఆర్ గోపాలకృష్ణ, జీ పురుషోత్తం, జే ఉమామహేశ్వరి, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : పీఎంవీవైఎస్ పథకానికి జిల్లాలోని అర్హులైన వివిధ చేతి వృత్తిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి అనిల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, కంసాలి, స్వర్ణకార, మేదరి, ఉప్పరి, వెదురు బుట్టలు అల్లేవారు, బొమ్మలు వేసేవారు, రజకులు, నాయీబ్రహ్మణులు, దర్జీలు, చేపల వలలు తయారు చేసేవారు, పూలు అల్లేవారితోపాటు 18 రకాల చేతి వృత్తులు చేసుకునే వారంతా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అర్హులైన వారు కామన్ సర్వీస్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పథకంలో ఎంపికైన వారికి నైపుణ్య ధ్రువీకరణ పరీక్షలు నిర్వహిస్తామని, అనంతరం 15 రోజుల పాటు అధునాతన శిక్షణ ఉంటుందని వెల్లడించారు. రూ.15 వేల విలువైన పరికరాలు అందించి, బ్యాంకు ద్వారా మొదటి విడుత రూ.లక్ష, రెండో విడుతలో రూ.2లక్షల రుణం అందించనున్నట్లు పేర్కొన్నారు.

రేకుర్తిలో గద్దెల అమ్మవార్లను వద్ద దర్శించుకుంటున్న భక్తులు

వనంలోకి తల్లులు

వన దేవతలు సమ్మక్క, సారలమ్మ శనివారం సాయంత్రం వనప్రవేశం చేశారు. చివరి రోజూ భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.. తల్లులు అడవిలోకి వెళ్లే వరకు మొక్కులు చెల్లించి, 'సల్లంగ సూడు తల్లీ' అని వేడుకున్నారు. నాలుగు రోజుల పాటు జరిగిన జాతర్లలో సమ్మక్క, సారలమ్మకు లక్షల సంఖ్యలో భక్తులు హారతిపట్టారు. ఒక్కో జాతర మినీ మేడారాన్ని తలపించింది. రేకుర్తి, కేశవపట్నంతోపాటు గోదావరిఖని, నీరుకుల్ల, కొలనూర్, వీణవంకలో లక్షలాది మంది మొక్కులు చెల్లించుకోవడం కనిపించింది. ఈ నెల 21న ప్రారంభమైన జాతరలు.. శనివారం సాయంత్రం గిరిజన దేవతలు వనంలోకి వెళ్లడంతో ముగిశాయి.

- కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 24

ఫర్టిలైజర్‌సిటీ: అమ్మవార్లను వన ప్రవేశానికి తీసుకెళ్తున్న కోయపూజారులు

కరీంనగర్‌కు మరో జాతీయ అవార్డు

- 'పే జల్ సర్వేక్షణ్'లో కైవసం
- 'అమృత్ సిటీ'లో భాగంగా ఎంపిక
- హర్షం వ్యక్తం చేసిన పాలకవర్గం



కరీంనగర్ కార్పొరేషన్, ఫిబ్రవరి 24 : కరీంనగర్ నగరపాలక సంస్థ మరో జాతీయ స్థాయి అవార్డు దక్కించుకున్నది. అమృత్ సిటీ పథకంలో భాగంగా 'పే జల్ సర్వేక్షణ్'లో మెరుగైన పనితీరు చూపి కైవసం చేసుకున్నది. ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ అవార్డును ప్రకటించింది. దేశవ్యాప్తంగా మెరుగైన పనితీరు చూపించిన అమృత్ సిటీలకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయి అవార్డులను ఇస్తున్నది. ఈ పథకంలో భాగంగా ఆయా నగరాల్లో మంచినీటి సరఫరా మెరుగుపరచడం, పార్కుల అభివృద్ధి, నగర సుందరీకరణ, తదితర కార్యక్రమాలకు నిధులు కేటాయించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అమృత్ కింద వచ్చిన నిధులు, అప్పటి రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అర్బన్ మిషన్ భగీరథ ద్వారా ప్రతి రోజూ మంచి నీటి సరఫరా చేస్తున్నారు. దీంతోపాటు హౌసింగ్ బోర్డు కాలనీ రిజర్వాయర్ పరిధిలో పైలెట్ ప్రాజెక్టు కింద 24 గంటల నీటి సరఫరా చేసేందుకు ఇప్పటికే అన్ని చర్యలూ తీసుకున్నారు. వచ్చే రెండు, మూడు నెలల్లో దీనిని కూడా ప్రారంభించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అలాగే పార్కులను కూడా సుందరంగా తీర్చిదిద్దారు. అనేక చౌరస్తాలను ఆకర్షణీయంగా అభివృద్ధి చేశారు. వీటితోపాటు మెరుగైన పనులను చేపట్టడంతో జాతీయ స్థాయిలో కరీంనగర్ నగరపాలక సంస్థను అవార్డుకు ఎంపిక చేశారు. కాగా, అమృత్ సిటీ పథకంలో భాగంగా ఉన్న ఐదు కేటగిరీల్లో ఏ విభాగంలో జాతీయ అవార్డు వచ్చింది. ఈ విషయాన్ని వచ్చే నెల 5న కేంద్రం ప్రకటించనున్నది. అయితే సఫాయి మిత్ర, స్వచ్ఛ సర్వేక్షణ్‌తోపాటు ఇతర అన్ని కార్యక్రమాల్లోనూ నగరపాలక సంస్థ మెరుగైన పనితీరు చూపించి అవార్డులను సొంతం చేసుకుంటుండంపై నగరవాసులు హర్షం వ్యక్తం చేశారు. పాలకవర్గ సభ్యులతోపాటు కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది కృషిని ప్రశంసించారు.

బాధ్యత మరింత పెరిగింది

కరీంనగర్ నగరపాలక సంస్థకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం మా పాలకవర్గంపై మరింత బాధ్యత పెంచింది. కేంద్రం ఇచ్చిన అమృత్ నిధులతో నగరంలో అనేక అభివృద్ధి పనులు చేయడంతోపాటు ముఖ్యంగా మంచినీటి సరఫరాను పూర్తిస్థాయిలో మెరుగుపర్చాం. అలాగే పార్కులు, చౌరస్తాల సుందరీకరణ పనులు చేపట్టాం. మా పాలకవర్గ సమయంలో జాతీయ స్థాయిలో అవార్డులు ఎక్కువగా వచ్చాయి. మరింతగా పని చేసి మరిన్ని అవార్డులు సాధించే దిశగా పని చేస్తాం. ఈ అవార్డు వచ్చేందుకు కృషి చేసిన పాలకవర్గ సభ్యులు, నగరపాలక అధికారులు, సిబ్బందికి అభినందనలు.

- వై సునీల్‌రావు, కరీంనగర్ మేయర్

బండలింగాపూర్‌లో మాట్లాడుతున్న సినీగేయ రచయిత డా. సుద్దాల అశోక్‌తేజ

పట్టుదలే ప్రగతికి సోపానం

జాతీయ ఉత్తమ సినీగేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 2 4: ఏ రంగంలోనైనా పట్టుదలతో కృషి చేస్తేనే ప్రగతి సాధ్యమవుతుందని, విద్యార్థులు కష్టపడి చదివితేనే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని జాతీయ ఉత్తమ సినీగేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ సూచించారు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో శనివారం రాత్రి నిర్వహించిన జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాను ఇక్కడ ఉపాధ్యాయుడిగా పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. వార్షికోత్సవ వేడుకకు తాను ముఖ్య అతిథిగా రాలేదని, బండలింగాపూర్ ప్రాథమిక పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడిగా వచ్చానని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని సూచించారు. క్రమశిక్షణ అలవర్చుకున్న విద్యార్థి ఉన్నత స్థానంలో నిలుస్తారని చెప్పారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆహూతులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జితేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థులు, మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

అట్టహాసంగా వీడ్కోలు వేడుక

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 24 : కరీంనగర్ జిల్లాకేంద్రంలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో వీడ్కోలు వేడుకలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ చాలా ముఖ్యమైనదని, విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే అన్ని విషయాలపై పట్టు సాధించాలని, తద్వారా సమాజంలో ఉత్తమమైన స్థానాన్ని కైవసం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఏకాగ్రతతో ప్రణాళికాబద్ధంగా ఉపాధ్యాయులు బోధించిన విషయాలను సమగ్రంగా సాధన చేయాలన్నారు.

గెలుపు కోసమే బీజేపీ సీబీఐ డ్రామా

- ఎమ్మెల్సీ కవితను రాజకీయంగా బద్నాం చేసి లబ్ధిపొందాలన్నదే ఆ పార్టీ లక్ష్యం
- బెదిరింపులు బీఆర్ఎస్‌కు కొత్తకాదు.. ధైర్యమే మా ఆయుధం
- జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, ఫిబ్రవరి 24, (నమస్తే తెలంగాణ) : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందే దురుద్దేశంతోనే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ ప్రభుత్వం సీబీఐ విచారణ పేరిట డ్రామా మొదలు పెట్టిందని జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ విమర్శించారు. ఈ మేరకు శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ తెలంగాణలో గెలిచే పరిస్థితి లేదనే విషయాన్ని గుర్తించి, బీఆర్ఎస్‌కు చెందిన ప్రస్తుత ఎమ్మెల్సీ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితపై రాజకీయంగా కుట్రలకు తెరలేపిందని విమర్శించారు. ఇప్పటికే పలుసార్లు ఆమెను ఇబ్బంది పెట్టిందని, ఎన్నికల తరుణంలో మరోసారి సీఆర్‌పీసీ 41 నోటీసులంటూ బద్నాం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. గతంలో ఫోన్లు ధ్వంసం చేశారన్న పుకార్లు పుట్టించి బద్నాం చేశారని, అయినా కవిత తన సెల్‌ఫోన్లను దర్యాప్తు సంస్థలకు అప్పగించి తన నిజాయితీని ప్రదర్శించారని చెప్పారు. భారత రాజ్యంగం మహిళలకు కల్పించిన ప్రాథమిక హక్కులకు అనుగుణంగా విచారణ నిర్వహించాలని ఎమ్మెల్సీ కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారని, ఆ అంశం కోర్టులో ఉండగానే బీజేపీ ప్రభుత్వం ఈసారి ఈడీకి బదులుగా సీబీఐని ఉసిగొల్పడం విడ్డూరంగా ఉందన్నారు. అయినా కేంద్రంలోని బీజేపీ తన మాట వినని నాయకులు, ప్రజాప్రతినిధులపై వేధింపులకు పాల్పడుతూనే ఉందని ధ్వజమెత్తారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు ఉంటే ఆ రాష్ట్రంలోని నాయకులపై కేసులు నమోదు చేస్తున్నదని, తమ ఆధీనంలో ఉన్న ఈడీ, సీబీఐ, ఇంటలిజెన్స్, ఇన్‌కంటాక్స్ వంటి సంస్థలను ఉసిగొల్పుతూనే ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం చెప్పినట్టు విన్న వారిపై ఎంత పెద్ద ఆరోపణలు ఉన్నా దాడులు చేయరని విమర్శించారు. దర్యాప్తు సంస్థలతో ఇబ్బందులు పెట్టాలన్న బీజేపీ ఆలోచనలు తెలంగాణలో నడువవని హెచ్చరించారు. ఉద్యమ కాలం నుంచి ఇలాంటి బెదిరింపులు వేలకొద్దీ ఎదుర్కొన్నామని, అలాంటి హూంకరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. బీజేపీకి ప్రజాక్షేత్రంలోనే సమాధానం చెబుతామని హెచ్చరించారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా నృసింహుడి రథోత్సవం

కొడిమ్యాల, ఫిబ్రవరి 24: నల్లగొండ నర్సింహస్వామి రథోత్సవం శనివారం వైభవంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజూ ఉత్సవమూర్తులను రథంపై ఆసీనులను చేసి గ్రామ వీధుల్లో ఊరేగించగా, ఎటుచూసినా సందడి కనిపించింది. ఉమ్మడి కరీంనగర్‌తోపాటు నిజామాబాద్, మెదక్, హైదరాబాద్, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఎదుర్కోళ్లు ఇచ్చి, పట్టే నామాలు, కోరమీసాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు భజనలు, యువతీయువకుల కోలాట నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మహిళలు మంగళహారతులిచ్చి స్వాగతం పలికారు. ఆలయ ఈవో వడ్లూరి అనూష ఏర్పాట్లను పర్యవేక్షించారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు పునుగోటి కృష్ణారావు, రాజనర్సింగరావు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.